# ద్రౌపదీ వస్త్రాపహరణము

చూశారాఅండి! ఆ అమ్మాయి కేవలం; అయోనిజ సుమండీ!?.

'అలాగటండీ, పంతులుగారూ!' అని కొట్టొచ్చినట్టు అన్నది తల్లి.

'అంటే, ఏమిటండీ?' అంటూ నవ్వుతూ కసిరింది, చంద్రం.

'అంటే, అదేం తప్పుమాట కాదండీ' అంటూ పంతులు ఉక్కిరి బిక్కిరైనాడు.

'మాట తప్పిజారితే, దాన్ని కూత అంటాం పంతులుగారు! నేనిలా అన్నానని మీకీ పాఠం చెప్పి పంపించిన దద్దమ్మలతో చెప్పండి. ఇదిగో, ఈ కాఫీ రవంతా స్వీకరించి దయచేయండి.' చంద్రం, ఈమాట యావత్తు నవ్వుగానే పలికింది. పంతులుచేయి గజగజలాడిపోయి, కాఫీ పంచమీద తొణికిపోయి, పట్టు బలవంతాన, పెదవి, గుక్క, చప్పరుమనిపించుకుని, పరుగెత్తినట్లు నిష్క్రమించాడు.

'ఏమిటే అమ్మాయి, యీ ఆగడం!' అంది తల్లి.

'ఇదో నాటకమమ్మా' అంది ముక్తసరిగా, చిన్నది.

'అంటే?' అన్నట్టు చూసింది, తల్లి.

అంతకన్న విప్పిచెప్పలేదు చిన్నది.

చంద్రం కులం వారందరూ, బంధుకోటి యావత్తు కళావంతులు. అందులో మరీ వృద్ధనారులు దేవదాసీలు. చంద్రం తల్లి, ఆ పిల్లా మటుకు భోగంవారు.

భోగందాన ననిపించుకోవడం తనకేం పరువు తక్కువకాదని, చంద్రం తల్లి కులంవారితో, సంస్కార సంఘంతో శరించి, తనకుతానే వెలివేసుకుంది. ఆమాటమీదే, విడిగానే బ్రతుకుతూంది. బిడ్డను పెంచుకుంటున్నది.

చంద్రం అచ్చంగా తల్లి చారికబిడ్డ. ఆ నిర్ణయం, ఆ నిర్లక్ష్యం, ఆ పరువూ, ఉగ్గు పాలతోనే అబ్బినవి.

కాలేజీ కుర్ర వాళ్ళకు, క్లాసులో ఇలాంటి చిన్నది ఉండటం, కన్నుల పండువ, కడుపుబ్బ. అందరూ దమయంతి స్వయంవరానికి హాజరైన ఛప్పన్న దేశాల రాజులకు మల్లె, నిత్యమూ, క్లాసులో మెడరిక్కించి, ఆ చిన్నదాని కటాక్షవీక్షణం ఎటు ప్రసరిస్తుందా అని పడిగాపులు పడిఉండటం తప్ప, అంతకన్న చదివే చదువు లేదు.

చంద్రానికి యీ ఆకతాయల పోకిళ్ళన్నీ, పూర్తిగా తెలుసును. ఎవడిగుండె దమ్ము ఎంతమట్టుకో తెలుసును. తాను భోగం పడుచుననీ, ఉత్తరత్ర అనువైన ధర పెట్టగల భాగ్యశాలికే దక్కేదాననని, తెలిసికూడా, తెరసరసాలకు కవ్వించుతూ, మాటంటే మాట అనలేని, ఆ వాజెలను చూస్తే, చంద్రానికి, ఏవో రాళ్ళనీ రప్పలనీ చూసినట్టుండేది కాని, కనీసం ఏవగింపన్నా లేదు.

ఏమీచేతగాక, ఎటూ పాలుబోక, ఈ అతిరథులందరూ కలిసి పన్నిన పథకం యిది. కాలేజీ వార్షిక ఉత్సవాలకు, ద్రౌపదీ వస్త్రాపహరణఘట్టం నాటకం.

కుర్రవాళ్ళందరూ ఏకమై అంతకు కొలది మాసాల క్రితమే, ముక్కు పచ్చలారకుండా సీమనుంచి దిగుమతి అయిన ప్రిన్సిపాల్‌ను మభ్యపెట్టి, ఇందుకు ఒప్పించారు. "మహాభరాటా," గ్రంథములో ఇదిముఖ్య ఘట్టమనీ, ఇంతకన్న ప్రజాదరణపొందిన ఇతివృత్తం మరోటి తెలుగునాటలేదనీ, నచ్చచెప్పారు. తతిమ్మా అధ్యాపకులకు యిందులో కిటుకు తెలియక, జోక్యం కలిగించుకోలేదు.

'ద్రౌపదివేషం నీవు వేసితీరాలమ్మా' అని ప్రిన్సిపాల్ చేత చంద్రాన్ని, అడిగించారు. 'మీకులం ప్రత్యేకం కళారాధనకు అంకిత మైందట. ఇలాంటి సంఘ నియమం ఏదేశంలోనూ లేదు. నాకు నీచాతుర్యం చూసే అవకాశం తప్పక కలిగిస్తావని విశ్వసిస్తున్నాను!' అని ప్రిన్సిపాల్ అతి ఉత్సాహంగా అమాయకంగా అడిగాడు. చంద్రానికి యీ అంతర్నాటకం అదివరకే తెలుసును. వెంటనే ఒప్పేసుకుంది.

ఇంత సులభంగా ఒప్పేసు కుందని తెలిసేటప్పటికల్లా, పన్నాగంమీద ఉన్న కుర్రవాళ్ళందరూ విస్తుపోయినారు. వాళ్ళ అభిప్రాయం, ఎత్తు, చంద్రాన్ని ఫలాని వేషం వేస్తావా? అని అడిగించేంతవరకే. అలా అంటే, ఎగిరి మండిపడి, నానారభస చేస్తుందని, వాళ్ళ తల్లిచేతకూడా వీలైనంత వరకూ తిట్టిస్తుందనీ, వినాయక చవితినాడు పల్లేరు కాయలుచల్లి తిట్లుతిన్నట్టు, అవన్నీ సరదాగా పడవచ్చుననీ, ఇంతవరకే ఉబలాట పడుతూన్న కుర్రవాళ్ళకు, చంద్రం తాపీగా ఒప్పేసుకుందని తెలియగానే పచ్చి వెలక్కాయలు గొంతున పడ్డవి. నిజంగా నాటకం ఆడటం అంటూ వస్తుందని ఏ వక్కడూ అనుకోలేదు. భుజాన వేసుకొని నిభాయించడం ఎవరి తరమూ కాదు.

ప్రిన్సిపాల్, సంగతి ఇది అని చెప్పడంతోనే, ఆ నటులందరికీ ఉత్తరక్షణంలో మలేరియా వచ్చేసింది. వెన్నంట వణుకు పుట్టుకొచ్చింది. కాళ్లూ చేతులూ ఆడలేదు. ఇందాకా వచ్చిన తరువాత ఇప్పుడు వెనుకంజ వేస్తే, ప్రిన్సిపాల్ గొంతు పుచ్చుకొంటాడు. ఏమిటి ఉపాయం?

అందుకూ చంద్రమే ఆదుకుంది. నిర్వహణకు తానేపూనుకొంది. నాట్యోద్రేకుల నందరినీ, ప్రిన్సిపాల్ సమక్షంలో సమావేశపరచి, భారమంతా తాను వహిస్తాననీ అందుకు అయేఖర్చు కాలేజీ బొక్కసంలోనుంచి పుచ్చుకోవడం సమంజసం కాదు కనుక, వేషధారులే తలకొక యింతా అని సద్దుకోవడం ఉచితమనీ చెప్పింది. అందరూ, 'దానికేం అలాగే!' అన్నారు.

ఖర్చు ఎంత అవుతుంది? రెండువేల రూపాయలు! అందరి గుండెలూ ఒక్కలగివిన ఎగిరి గంతేసి, ఒక్కలిప్తకాలం చప్పగా ఆరిపోయినాయ్! ఎవడి మనసులోవాడు కత్తులు దూశాడు. ఏమిటి ఈఎత్తు? ఇదేం కన్నెరికపు సంబరమనుకున్నదా? ఈ రూపేణా, సంపాదించు దామనుకుందా?

కాని, ఈ మాటలేమీ, ప్రిన్సిపాల్ ఎదుట అనేసేందుకు వల్లకాదాయెను! ఎవడికివాడు, నసిగి, ఇకిలించి, గొంతు సవరించుకుని, అప్పటికి తప్పించుకు బయట పడ్డాడు. ఎవరూ స్వతంత్రుడు కాడు. ఇంటిదగ్గర ఇందుకోసం ఇన్నివందల రూపాయలు కావలెనని అడిగితే ఏ తండ్రి అయినా, ధణు తెగరకొడతాడు కాని, 'పట్టుకెళ్ళి హాయిగా తగుల వేయిరా నాయనా!' అని అడిగినంతా దరిశించు కుంటాడా?

మళ్ళీ ఇందుకూ, చంద్రమే ఆదుకున్నది. అయే ఖర్చు తాను ఒక్కతెనే భరించగలననీ, తమ తాహతుకు యిది ఒక లెక్కలోది కాదనీ, ప్రిన్సిపాలును

ఒప్పించింది. కుర్రవాళ్ళకు ఇంతతో యీ గండం కూడా గడచింది.

ఇక అసలు తతంగం నడవాలి. ఎవరెవరు ఏయే వేషాలు వేయడం? ఇంతకూ యెన్ని వేషాలు ఉంటాయి, అన్నింటికన్నా ముఖ్యం దుశ్శాసనుడి పాత్ర యెవరు ధరించడం? స్టేజిమీద, పురజనుల, సమక్షంలో, చంద్రం కొంగు పట్టుకు యథోచితంగా బీభత్సం చేయడానికి యెవరు నోచుకుంటారు?

యెవరికి వాళ్ళకే వంతులు తెగలేదు. కళ్ళుమూసుకు, కానీ ఎగురవేసి చూసి, ఇలాటి ప్రక్రియలు మరికొన్ని చేసి, ఒక రోజల్లా తర్జన భర్జనపడి చివరకు, తతిమ్మా వాళ్ళందరూ ఉసూరుమని ఒక్క అదృష్టవంతుడికి, అది కట్టపెట్టారు. సరే, ఆవలి కథాక్రమం?

అందరిలోకి అమాయకుణ్ణి ఏరి, వాడిని చంద్రం ఇంటికి తరిమారు. ద్రౌపది గుణగణాలు వర్ణించి చెప్పి, ఆ పాత్ర ఎలా అభినయించాలో, వేషం యెలా వేయాలో, ఇత్యాదులు కొన్ని అవాకులు చెవాకులు వాగమని, ఇలాగైనా కవ్వించి, చంద్రాన్ని ముగ్గులోకి దించవచ్చును కదా అని వాళ్ళ అభిప్రాయం:

కాని, ఆ పప్పులేమీ ఉడకలేదు. పంతులు, వాళ్ళ ఇంటికి వెళ్ళి అతి ఛాందసంగా నోరు ఎత్తీ ఎత్తడంతోనే, చంద్రం వేడి కాఫీ పోసి పంపేసింది. మళ్ళీ గుప్ చుప్!

ఇక గత్యంతరం లేక, అందరూ కట్టకట్టుకు ప్రిన్సిపాల్ దగ్గిర మొరబెట్టుకున్నారు. వార్షికోత్సవాలు పట్టుమని పదిహేను రోజులైనా లేవు! ఇంతవరకూ రిహోర్సలంటూ లేదు. చంద్రం ఒక్కమారన్నా కలిసి సంప్రదించడం కాని, మనిషి కనబడటం కాని లేదు. ఆడపిల్ల మాట నమ్మి తాత్సారం చేస్తే చివరకు అభాసు అయితే, కాలేజీకి తలవంపులు కావూ?

ప్రిన్సిపాల్ చంద్రాన్ని పిలిపించి, ఏమిటని అడిగాడు.

'ఏమిటేమిటి?' అన్నది ఆ చిన్నది.

'నాటక యత్నం!'

ఆ యత్నంలోనే ఉన్నాం!

'మరి, వీళ్ళందరితోనూ సంప్రతించి –'

'అవసరం లేదు. ఇది కేవలం నాట్య రూపకం. ఒక్క దుశ్శాసనుడికి తప్ప వేషంలేదు. ఆ వేషానికన్నా, మాటామంతీ లేదు. యెవరు వేసినా అభ్యంతరం లేదు.' ఇంతవరకూ ఇంగ్లీషులో చెప్పి చిరునవ్వుతో అందరినీ కలియచూసి, 'దుశ్శాసనుడికి రిహోర్సల్ అవసరమైతే, ఈలోగా ఇంట్లో తల్లినో చెల్లెలినో, ఈ మాత్రం సాయపడమంటే అభ్యంతరం చెప్పదనుకుంటాను!' ఈ ముక్కలు తెలుగుతో చెప్పి, ప్రిన్సిపాల్ దగ్గిర సెలవు తీసుకొని చక్కాపోయింది. కుర్రవాళ్ళ మొగాలన్నీ కందగడ్డలైనాయి. ఏమన్నదని ప్రిన్సిపాల్‌ను అడిగినా జవాబు చెప్పకుండా విసురుగా వెళ్ళిపోయినారు.

ఇంత పచ్చిగా అడిగిందే అని ప్రతివాడికీ కత్తికోతగా ఉంది. యెలా కసి తీర్చుకోవడమా అని వేదనగా ఉంది. భారమంతా దుశ్శాసనుడి మీదవేశారు. కళ్ళు మూసుకొని మంచీ చెడ్డా యెంచకుండా అందినంతవరకూ బీభత్సం చేయమన్నారు. వాడూ సైఁ అన్నాడు.

నాటకం రోజు వచ్చింది. ఊళ్ళో పెద్దలందరూ వచ్చారు. చంద్రం ద్రౌపది

వేషం అమోఘంగా ఉంది. ఆ నాట్యం, ఆ ఆహార్యం, ఆ గానం దివ్యంగా ఉన్నాయి.

అవతలప్రక్క నిలుచున్న దుశ్శాసనుడికి సైగచేసి, చంద్రం ఇటు నిష్క్రమించింది. దుశ్శాసనుడు ఆర్భాటంగా అంగలువేస్తూ, ముందుకుసాగి, అందించిన చీర కొంగు అందుకుని ఒక్కలాగులాగి, తేలుకుట్టినట్టు అదిరిపడి, కుప్పిగంతు పెట్టి స్టేజి దిగి, జనసమూహంలోంచి కుర్చీలు తన్నుకుంటూ పారిపోయినాడు.

ఎవరికీ యీ మార్పు ఏమిటో అర్థం కాలేదు. అంతా అలజడి - ఇంతలో చంద్రం రంగస్థలం మీదికి వచ్చింది. ఆమెతోబాటు అలాగే వేషం వేసుకున్న ఆడపిల్లలు చాలామంది, కలిసి లాస్యం చేశారు. 'నేను సర్వాంతర్యామి అయిన కృష్ణుని సోదరిని, నన్ను అవమానించడానికి ఒక అల్పుడి తరమౌతుందా' అని అర్థం వచ్చే గీతం సాభినయంగా చంద్రం పాడింది. నాటకం భేషుగ్గా అఖరైంది.

ప్రిన్సిపాల్ పరమానంద భరితుడైనాడు. తనకు ఇలాటి ప్రదర్శనాన్ని దర్శించే అవకాశం లభించేట్టు, ఒనగూర్చి నందుకు చంద్రాన్ని ప్రశంసించాడు. భారతదేశపు కళాభిజ్ఞతకు జోహారు చేశాడు.

ఊరంతా అట్టుడికి పోయింది. చూసిన వారందరూ వేలం వెర్రిగా చెప్పుకున్నారు. కలలో అయినా సాని గడప మొగం ఎరుగని అహితాగ్నులుకూడా చంద్రం యింటికి పనివేళా వెళ్ళి అతివాత్సల్యంగా ప్రశంసించి వచ్చారు.

దుశ్శాసనుడికి ఆ పూటనుంచీ ఒళ్ళెరుగని జ్వరం. వడ్లగింజ వేస్తే పేలగింజ అవుతూంది. కోలుకునేప్పటికి, ఆ యేటికి పరీక్షకు వెళ్ళేందుకు రోజులు తక్కువైనాయి.

ఏం జరిగిందో అది రండాగర్భం లాటిది. దొంగకు తేలు కుట్టినట్టు, బయట చెప్పడానికి వీలులేదు. కాని, తతంగం ఇది.

ఎవడికి వాడు, కుర్రవాళ్ళందరూ, చంద్రం కోక స్టేజి, మీద ఒలిస్తే చూసి సంతోషించవచ్చుననే సంబరంలో తమకూ తల్లీతోడూ ఉన్నదనే సంగతే తాత్కాలికంగా మరచిపోయినారు. వాళ్ళలో దుశ్శాసనుడు మరీ మర్తా!

చంద్రం చెంగు పట్టుకు లాగుదామని అమితోత్సాహంలో దూకిన వాడికి, చంద్రం బదులు, ఆ వేషంలోనే అతని చెల్లెలు కొంగు అందించింది. పైట జారిపోయి, అలా తనతోబుట్టిన పడుచును చూడగానే, దుశ్శాసనుడికి తల తిరిగిపోయింది. ఆ వేషంతోనే యిల్లు చేరుకొని, పడక వేశాడు.

ఊళ్ళో పెద్దలకు, కళాభిమానులకు, కుర్రవాళ్ళకు దిమ్మతిరిగేట్టు ఆడపిల్లలందరూ కలిసి కట్టుగా కొట్టిన దెబ్బ కీలకం - తెలియవలసిన అగత్యం లేదు. చూశారు - సంతోషించారు. చంద్రం తాను తనలో నవ్వుకుని ఊరుకుంది.

మరుసటి యేడు. ప్రిన్సిపాల్ చంద్రాన్ని హెచ్చరించాడు - నాటకం సంగతి ఏమిటని! కుర్రవాళ్ళందరూ పూనుకుంటే తనకూ, తనతోటి పిల్లలకూ అభ్యంతరం లేదంది. కాని, ఒక్క రాయుడూ ముందుకు రాందే! ప్రిన్సిపాల్ భారతీయుల తత్త్వం అర్థంకాక, నిరుడి కళా రసికులందరూ ఈ యేడు ఇలా వేదాంతులుగా మారిపోవడానికి కారణం ఏమో అని అబ్బురపడ్డాడు. ప్రాచ్య సంస్కృతి దాని అంతర్యం అనూహ్యమని, సర్ది చెప్పుకున్నాడు. చంద్రం ఎప్పుడూ అలాగే, చిరునవ్వుతోనే ఉంటుంది. కాని, అది కొందరికి సింహస్వప్నం!

★ ★ ★